# రమణ భాస్కర

## (అంతర్వేదిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 30-1-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భారతదేశంలో ఉన్న విష్ణు క్షేత్రాలలో అంతర్వేది ఒకటి. ఇది చాలా ప్రాచీనమైన క్షేత్రము. వశిష్ఠమహర్షి చేత స్థాపించబడిన క్షేత్రం. వశిష్ఠుడు ప్రార్థననుసరించి నరసింహస్వామి ఇక్కడ వెలిసాడు. ధర్మ, అర్థ, కామ, మోక్ష ఇవి నాలుగు పురుషార్థములు అని చెపుతారు. భక్తి ఐదవ పురుషార్థం అని భాగవతంలో చెప్పారు. భక్తి అవసరం, భక్తి జ్ఞానమాత అని భగవాన్ చెప్పారు. పూర్వకాలంలో అనేక నియమాలు పెట్టుకొని తపస్సులు చేసేవారు. కాల ప్రవాహంలో మానవుడికి తపస్సుచేసే శక్తి తగ్గిపోయింది. తరువాత యజ్ఞాలు, యాగాలు వచ్చాయి. ఈలోకానికి గాని, పరలోకానికి గాని సంబంధించిన కోరికలు ఏమీ లేకుండా, భోగ ప్రవృత్తి లేకుండా కేవలము సమాజమును దృష్టిలో పెట్టుకొని సమాజ క్షేమం కోసం నీవు ఏపనిచేసినా ఆపని యజ్ఞముతో సమానము అని కృష్ణుడు గీతలో చెప్పాడు. శరీరం ఏదోరోజు మరణిస్తుంది. కాని లోపల ఉన్న వస్తువుకు ఎప్పుడూ ఉండటమే దాని పని. ఆవస్తువును తెలుసుకోవటానికి ఏభోగ ప్రవృత్తి అయితే అడ్డు వస్తోందో దానిని వెతికి లోయలలోనికిదిగి భోగప్రవృత్తిని బయటకులాగి మంటపెట్టి బూడిదచేస్తే వాడు జ్ఞాని అవుతాడు.

మనకు బంధువులు, స్నేహితులు ఉన్నారు. ఇదేనిజం అని మనం అనుకొంటున్నాము. మన శరీరం మరణించిన తరువాత ఒక్క బంధువుగాని, స్నేహితుడు గాని మన కూడా రాడు. వారికి తొందర పనులు ఉంటే స్మశానం వరకూ కూడా రారు. ఇది మానవ జీవితం. ఈ బంధువులమీద ప్రేమతో, స్నేహితులమీద ప్రేమతో లోపల ఉన్న వస్తువును మర్చిపోయి మన రాగ ద్వేషములకు మనస్సును పరిమితం చేసుకొంటే మరణానంతరం చీకటి లోకాలు వస్తాయి. రాగ ద్వేషములకు మనస్సును పరిమితంచేస్తే రాగ ద్వేషముల ప్రేరితం వలన వచ్చే కోరిక వలన మనలో ఒక స్వభావం ఏర్పడుతుంది. ఆ స్వభావం మరణానంతర జీవితంలో మన కూడా వచ్చేస్తుంది. బంధువులు, స్నేహితులు మనకూడా రారు. వారి పేరుమీద మనం ఏర్పరచుకొన్న స్వభావం మరణానంతరం మన కూడా వస్తుంది. ఈప్రపంచంలో అనేకమంది వ్యక్తులను, వస్తువులను, సంఘటనలను చూస్తున్నాము. ఈశరీరం మరణించిన తరువాత ఈ వ్యక్తులుగాని, వస్తువులుగాని, సంఘటనలుగాని మనకూడారావు. వీటికి సంబంధించిన **reactions** మనలో స్వభావం క్రిందమారి మనకూడా వచ్చేస్తాయి. మిమ్మల్ని చూసి నేను అసహ్యించుకొన్నాను అనుకోండి. మీరు నాకూడా రారు. మిమ్మల్ని చూసి అసహ్యించుకొన్నబుద్ధి స్వభావంగామారి మరణాంతరం నాకూడా వస్తుంది. మహాత్ములను దర్శించటం వలన, సత్పురుషుల సహవాసంవలన, పూజ, జపం, ధ్యానం చేయటం వలన మన స్వభావం మారుతుంది. చర్మదృష్టి తగ్గుతుంది, ఆత్మదృష్టి పెరుగుతుంది. నీ హృదయంలో ఉన్న మరణంలేనిస్థితిని నీవు తెలుసుకోవాలి అంటే నీకు ఉన్న ప్రస్తుత స్వభావంతో నీవు తెలుసుకోలేవు. నీ స్వభావం మారాలి. పాడుబుద్ధి పోవాలి. సద్బుద్ధి, సహృదయం కలగాలి. ధనం, సెక్స్, అధికారం ఈ మూడు ప్రపంచంలోనుండి తీసివేయండి. అప్పుడు ఈ ప్రపంచానికి విలువ లేదు అని రామకృష్ణుడు చెప్పారు.

మన స్వభావం దేహానికి సంబంధించిన విషయాలవైపు పరుగెడుతోంది. దేహానికి పరిమితమైన బుద్ధిని ఎలా సంతృప్తి పరచుకోవాలి అని తప్పించి మనకు ఇంకో పనిలేదు. తల్లి కడుపులోనుండి బయటకు

వచ్చినది మొదలు స్మశానమునకు వెళ్ళే వరకూ ఈ అహంవృత్తిని ఎలా సంతృప్తి పరచుకొందాము అనే గొడవలే గాని ఈ స్వభావంలోనుండి మారి, దేహానికి పరిమితమైన బుద్ధిలోనుండి విడుదల పొంది ఆత్మజ్ఞానం పొందాలి అనే తలంపే మనకు ఉదయించటంలేదు. ఈ స్వభావం ఇంతే అని మనం వదిలివేయకూడదు. ప్రయత్నం చేయగా, చేయగా తప్పకుండా స్వభావం మారుతుంది సాధన మన గొప్పలకోసం, గౌరవాలకోసం కాదు. మన స్వభావం మార్చుకోవటానికి సాధన చేయాలి .

నిన్ను ఎంతకాలం ఉపయోగించుకోవాలో అంతకాలం ఉపయోగించుకొన్న నీ బంధువులుకాని, నీ స్నేహితులుకాని నీకూడా రారు. ఇక్కడే ఆగిపోతారు. కాని గురువు మాత్రం నిన్ను వదిలిపెట్టడు. నీ అవసరం గురువుకు ఏమీలేదు అయినా నిన్ను వెంటాడతాడు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. జన్మ జన్మలకు నీకూడా వస్తాడు. నీకూడా ఎందుకు వస్తాడు అంటే నీస్వభావంలో ఉన్న బలహీనతలను వెదికి నీకు చూపించి నీచేత సాధన చేయించి వాటిని బయటకు లాగి కాల్చి బూడిద చేసేవరకు నిన్ను వదిలి పెట్టడు వాడు గురువు. మన సాధన వలన భగవంతుని పొందలేము. ఆయన అనుగ్రహం వలన భగవంతుని పొందుతాము. సాధన ఎందుకు చేయాలంటే సాధన చేయగా,చేయగా ఇందులో ఏమీలేదు అని మనకు తెలుస్తుంది. కేవలము నీ ప్రయత్నం వలన భగవంతుడు తెలియబడడు. భగవంతుని అనుగ్రహం ఎవడికైతే కలిగిందో వాడికి మాత్రమే భగవంతుడు తెలియబడతాడు.

బుద్ధుడు శరీరం విడిచిపెట్టి వెళ్ళేముందు ఆయన దగ్గర ఉన్నఆనంద్ బుద్ధుడితో నీలాంటి మహాజ్ఞాని ఇంతకుముందు ఈభూమిమీద పుట్టలేదు అన్నాడు. నీకు చరిత్ర తెలుసా అని బుద్ధుడు ఆనంద్‌ను అడిగాడు. నాకు తెలియదు అని చెప్పాడు. పూర్వీకులగురించి తెలియకుండా బుద్ధుడు అంతటి గొప్పవాడులేడని నీకు ఎలా తెలుసు? ఇటువంటి మాటలు చెప్పవద్దు. నాగురించి మాట్లాడకు, నాగురించి ఆలోచించకు, నాగురించి విలపించవద్దు. నువ్వు ఏరకంగా జీవిస్తే మోక్షమును పొందుతావో ఆరకంగా జీవించటం నేర్చుకో. అంతేగాని బుద్ధుడు గొప్పవాడు అని చెప్పటం వలన నీకు ఏమికలిసివస్తుంది అన్నాడు. భగవాన్ దగ్గరకు ఒక భక్తుడు వచ్చాడు. భగవాన్ అతని వంక చూసారు. జ్ఞాని ఒక్కసారి చూస్తేచాలు ఆ చూపుద్వారా మన అజ్ఞానానికి మంటపెడతాడు. నాకు జ్ఞానం కావాలి అని అడిగాడు. ఎవరికి కావాలి జ్ఞానం అన్నారు భగవాన్. నాకు కావాలి అన్నాడు. ఆనేనును విడిచిపెట్టు ఉన్నది జ్ఞానమే అన్నారు భగవాన్.

నాకు చాలా ధైర్యం ఉంది. ఆధైర్యంతో, తెలివితో భగవంతుడిని తెలుసుకొంటాను అని కొంతకాలం ప్రయత్నం చేస్తాడు. ఎప్పుడో బోర్లా పడతాడు. నావల్ల ఏమీకాదు నువ్వే చేసిపెట్టు అని అప్పుడు భగవంతునికి శరణాగతి చెందుతాడు. మనస్సు చిక్కబడుతూ ఉంటే అది బయటకు విజృంభిస్తూ ఉంటుంది. మనస్సు పల్చబడుతూ ఉంటే అది లోపలకు ఉపసంహరింప బడుతూ ఉంటుంది. రజోగుణంలో ఉన్నప్పుడు మనస్సు విజృంభణ ఎక్కువగా ఉంటుంది, మనస్సు సత్వగుణంలో ఉన్నప్పుడు విజృంభణ తక్కువగా ఉంటుంది. నిరహంకారముగా పని చేస్తూఉంటే, నిరాడంబరముగా జీవిస్తూ ఉంటే మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. నాకు తలంపులు రాకూడదు, నాకు కోరికలు రాకూడదు అంటే ఇంకా ఎక్కువగా వచ్చి కూర్చొంటాయి. నీవుకాని మనస్సుతోటి, దేహంతోటి, లోకంతోటి నీవు ఎంతకాలం అయితే తాదాప్యం పొందుతూ ఉంటావో అంతకాలం తలంపులు వస్తాయి, కోరికలు వస్తాయి. వీటినిబట్టి జన్మలు వస్తూ ఉంటాయి. దేహంచనిపోయినపుడు నీవుచావవు. ఈదేహంపోతుంది. ఇంకోదేహం వేసుకొని సిద్ధమవుతావు. ఇంక నీవు చనిపోతున్నట్లు కాదు. ఇవి అన్నీ దొంగచావులు. ఎవడైతే తిరిగి ఈ భూమిమీదకు రాడోవాడు చనిపోతున్నట్లు గాని నీవు చనిపోతునట్లు కాదు.